బెల్ట్ ఫుల్..!



కర్నూలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

దేవనకొండ మండలం పి. కోటకొండ గ్రామ జనాభా దాదాపు పది వేలు. ఇక్కడ 30కి పైగా మద్యం బెల్ట్ షాపులు ఉన్నాయి. కొందరు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్రపురం, తుంగభద్ర నది ఒడ్డున రెండు బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా యంత్రాంగం ఉండే కర్నూలు నగర శివారుల్లోని వీకర్ సెక్షన్ కాలనీల్లో గల్లీకో బెల్ట్ షాపు పెట్టి అందిన కాడికి దండుకుంటున్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి. పల్లెపల్లెన మద్యం ఏరులై పారుతోంది. టీడీపీ కూటమి ముఖ్య ప్రజాప్రతినిధుల అండదండలతో, ఎక్సైజ్ నిఘా కళ్లకు గంతలు కట్టుకోవడతో ఊరూరా.. వీధివీధినా మద్యం బెల్ట్ షాపులు బార్లా తెరుచుకున్నాయి. మద్యం బెల్ట్‌షాపులపై క్షేత్రస్థాయి వాస్తవాలతో ఆంధ్రజ్యోతి కథనం.



- విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా
- ప్రతి నెల రూ.కోట్లకు పైగా మద్యం అమ్మకాలు
- కళ్లకు గంతలు కట్టుకున్న ఎక్సైజ్ నిఘా
- సీఎం హెచ్చరికతోనైనా బెల్ట్ షాపులకు కళ్లెం పడేనా?

జిల్లాలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేస్తే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 2019కి ముందు తరహాలో ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగిస్తూ.. రెండేళ్ల లీజుకు దరఖాస్తులు స్వీకరిస్తే 3,046 మంది దరఖాస్తులు చేశారు. రుసుం రూపంలో రూ.60 కోట్లకుపైగా ఖజానాకు ఆదాయం వచ్చింది. లాటరీ ద్వారా మద్యం షాపులు లీజుదారులకు అప్పగించారు. నవంబరు ఒకటో తారీఖు నుంచి లీజుదారులు మద్యం షాపులలో అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుకోవచ్చు.. తాగొచ్చు. అయితే.. ఎక్కడో ఉన్న లైసెన్సుడ్ మద్యం షాపులకు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా.. మద్యం ప్రియులకు అందుబాటులోకే మద్యం అన్నట్లు పల్లెపల్లెన.. వీధివీధిన అనధికారిక బెల్ట్ షాపులు బార్లా తెరుచుకున్నాయి. మూడు క్వార్టర్లు.. ఆరు బీరు సీసాల్లో విస్తరిస్తున్నారు. టీడీపీ కూటమి ముఖ్య ప్రజాప్రతినిధులు, వారికి సన్నిహితంగా ఉండే కీలకమైన నాయకుల అండతో ఈ వ్యవహారం సాగుతున్నట్లు తెలుస్తున్నది. మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపుల నిర్వహణలో ఈ స్థాయిలో రాజకీయ జోక్యం మునుపెన్నడు చూడలేదని ఎక్సైజ్ శాఖ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారంటే ఏ స్థాయిలో విస్తరించారో ఇట్టే తెలుస్తుంది.



కృష్ణగిరి మండలం అమకుతాడులో బెల్ట్ షాపుపై దాడులు చేసిన ఎక్సైజ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన స్థానికులు

ఒక్కో బెల్ట్ షాపునకు ఒక్కో రేటు

కర్నూలు సిటీ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 31, కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14, ఎమ్మిగనూరులో 15, కోసిగిలో 4, పత్తికొండలో 14, ఆదోనిలో 12, ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 లైసెన్సుడ్ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఒకటి రెండు మద్యం షాపులు ఉంటే.. ఏ పల్లెకు వెళ్లినా ఏమున్నది గర్వకారణం.. వీధివీధిన... సందుసందున మద్యం బెల్ట్ షాపులే అన్నట్లుగా మార్చేశారు. ప్రతి పల్లెలో 3 నుంచి 5 బెల్ట్ షాపులు ఉంటే, పెద్ద గ్రామాల్లో 10-15కిపైగా ఉన్నాయని తెలుస్తుంది. ఒక్కో బెల్ట్ షాపులకు ఒక్కో రేట్ చొప్పున మద్యం షాపుల యజమానులు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు డిపాజిట్ రూపంలో వసులు చేసినట్లు తెలుస్తున్నది. డిమాండ్ ఉన్న పల్లెల్లో రూ.లక్ష వరకు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతి షాపు నుంచి నెల మామూళ్లు నిర్ణయించడం, ముఖ్య ప్రజాప్రతినిధులు జోక్యంతో ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం చూసీచూడనట్లు వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బెల్ట్ షాపుల నిర్వహణలో అధికార టీడీపీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్ష వైసీపీ నాయకులు ఉండడం కొసమెరుపు.

నిఘా ఉంచాం



గ్రామాల్లో బెల్ట్ షాపులపై నిఘా పెట్టాం. ఎక్సైజ్ స్థానిక, విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. నవంబరు నెలలో 66 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి 350 లీటర్లు ఐఎంఎల్ మద్యం సీజ్ చేసి 64 మందిని అరెస్ట్ చేశాం. మరో 70 కేసులు నమోదు చేసి కర్ణాకట తయారీ అక్రమ ఎన్‌డీపీఎస్ మద్యం 934 లీటర్లు సీజ్ చేశాం. 23 నాటు సారా కేసులు నమోదు చేశాం.

- సుధీర్‌బాబు, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్

క్వార్టర్ సీసాపై రూ.25 అదనం

ప్రభుత్వ లైసెన్స్ మద్యం షాపులో విక్రయించే ఎమ్మార్పీ ధరలు కంటే ఎక్కువ ధరలకు బెల్ట్ షాపులు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సామాన్యులకు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు ఇవ్వాలనే లక్ష్యంగా రూ.99లకే క్వార్టరు లిక్కరు తీసుకొచ్చారు. ఇదే సీసా గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో రూ.125 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఇతర బ్రాండ్ల మద్యం క్వార్టర్ సీసా, బీరు సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.15 నుంచి రూ.25 వరకు అదనంగా వసులు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదే అదనుగా మంత్రాలయం, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కర్ణాటక, తెలంగాణ సరిహద్దు మండలాల్లోని గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో కర్ణాటక తయారీ అక్రమ మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్-ఎన్‌డీపీఎల్) విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో సుమారుగా 2 వేలకు పైగా మద్యం బెల్ట్ దుకాణాలు ఉన్నాయని అనధికారిక సమాచారం. నవంబరు నెలలో అధికారికంగా రూ.75 కోట్లు విలువైన మద్యం 96,330 కేసులు లిక్కరు, 37,676 కేసులు బీరు విక్రయాలు జరిగాయి. అందులో బెల్ షాపుల్లో ఒక్కటే రూ.25 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయని అంచనా వేస్తున్నారు.

బెల్ట్‌కు కళ్లెం పడేనా..?

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ప్రజావేదిక సభలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ .. మద్యం మాఫియాను అరికట్టి తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచాం.. మద్యం వ్యాపారంలో ఇతరుల జోక్యాన్ని సహించను. బెల్టు షాపులు పెడితే నేను కూడా బెల్టు తీయాల్సి వస్తుంది.... అని హెచ్చరించారు. అయినా టీడీపీ కూటమి నాయకుల్లో మార్పు వస్తుందా..? ఎక్సైజ్ అధికారుల్లో కదలిక వస్తుందా..? ఊరూవాడా విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టు షాపులకు తాళం పడుతుందా..? అన్నది ప్రశ్నార్థకమే. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ కీలక ప్రజాప్రతినిధులే జోక్యం చేసుకోవడంతో నిఘా అధికారులు కళ్లకు గంతులు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అక్షరాస్యతలో అగ్రగామిని చేద్దాం



24 వరకు ఉల్లాస్ సర్వే
మే 5వ తేదీ నుంచి సెప్టెంబరు 18 వరకు క్లాసులు
డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్ది కర్నూలు జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలుపుదామని డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం అమలుపై డీఆర్వో జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది ఉల్లాస్ కార్యక్రమం మొదటి స్పెల్‌లో 28,872 మందికి గాను 27,200 మంది ఎఫ్ఎల్ఎన్ఏ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్టు)కి హాజరయ్యారని, అందులో 25,257 మంది సక్సెస్ అయ్యారని అన్నారు. అదే విధంగా ఈ ఏడాది 30,005 మందికి అక్షరాస్యతను నేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. అర్బన్‌లో 50 శాతం, రూరల్‌లో 50 శాతం మందిని గుర్తించాలని డీఆర్‌డీఏ మెప్మా అధికారులను ఆదేశించారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 24 వరకు 9 రోజుల పాటు సర్వే మొదలు పెట్టి నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. ఆ తర్వాత వారికి మే 5వ తేదీ నుంచి సెప్టెంబరు 18 వరకు క్లాసులు నిర్వహించి సెప్టెంబరు 21న ఎఫ్ఎల్ఎన్ఏ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందు కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లను సాయంత్రం 2 గంటల పాటు అక్షరాస్యత కేంద్రాల కోసం వినియోగించాలన్నారు. వయోజన విద్యాశాఖ డీడీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు, వంటవారు, సహాయకులు, ప్రభుత్వ రాత్రి వాచ్‌మెన్, ప్రభుత్వ సహాయక పాఠశాలలు, అంగన్‌వాడీ సహాయకులు, ఆయాలు, ఎన్ఆర్ఈజీఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై వినూత్నంగా అమలు చేయబడుతోందన్నారు. ఈ సమావేశంలో సమాచార శాఖ డీడీ కే.జయమ్మ, డీఈఓ శామ్యూల్ పాల్, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఎస్ఐలకు స్థానచలనం



కర్నూలు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పలువురు ఎస్ఐలకు స్థానం కల్పిస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కొంత మంది ఎస్ఐల బదిలీలు జరిగినప్పటికీ కొంత మంది బదిలీలు నిలిచిపోయాయి. కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులును కర్నూలు టూటౌన్‌కు కేటాయించగా.. ఆయనను తిరిగి చిప్పగిరికి నియమించారు. చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్‌ను కర్నూలు టూటౌన్‌కు బదిలీ చేశారు. గూడూరు ఎస్ఐ తిమ్మయ్యను ఇన్వీకి బదిలీ చేయగా.. ఆయన బదిలీ నిలిచిపోయింది. ఆయన తిరిగి గూడూరు ఎస్ఐగానే కొనసాగుతారు. పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డిని గూడూరు ఎస్ఐగా నియమించగా.. ఆయన బదిలీ కూడా ఆగిపోయి తిరిగి పెద్దకడుబూరు ఎస్ఐగానే కొనసాగుతారు. ఎమ్మిగనూరు టౌన్ ఎస్ఐ నాయక్‌ను పెద్దకడుబూరుకు బదిలీ చేయగా.. ఆయన్ను తిరిగి ఇన్వీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఖాజావలి మహిళా పోలీస్ స్టేషన్‌కు నియమిస్తూనే తిరిగి స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేశారు.

ఆలూరు మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్ కన్నుమూత



మచ్చలేని నేతగా గుర్తింపు
నేడు మొలగవల్లిలో అంత్యక్రియలు

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆలూరు మాజీ ఎమ్మెల్యే జి.లోక్‌నాథ్(85) బుధవారం కన్నుమూశారు. ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన లోక్‌నాథ్ గోవాలో వ్యాపారం చేసేవాడు. ఆలూరు అసెంబ్లీ స్థానం ఎస్సీ జనరల్‌గా మారడంతో అదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రెడ్డి, అప్పటి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి సహకారంతో 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆలూరు అభ్యర్థిగా లోక్‌నాథ్ పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థి రంగయ్యపై 39వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ హయాంలో లోక్‌నాథ్ టీటీడీ బోర్డు సభ్యుడిగా కూడా పనిచేశారు. రాజకీయాల్లో నిస్వార్థ సేవలు అందించిన ఆయన చివరి వరకు కోట్ల విజయభాస్కర్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా నిలిచారు. అప్పట్లో ఆయన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏడాది పాటు బెడ్ రెస్ట్‌లో ఉండిపోయాడు. కనీసం సొంత ఇల్లు కూడా లేకుండా అద్దె ఇంట్లో సాధారణ జీవనం సాగించాడు. ఎక్కడికైనా సరే కాలి నడకన వెళ్లేవారు. ఎమ్మెల్యేగా కోట్లాది రూపాయలు సంపాదించే అవకాశం ఉన్నప్పటికీ ఆయన చివరివరకు ప్రజా సేవకే అంకితమయ్యారు. ఆయనకు భార్య సులోచన, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్ అంత్యక్రియలు గురువారం ఆలూరు మండలం మొలగవల్లిలో నిర్వహించనున్నారు.

ప్రముఖుల సంతాపం : మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్ మృతిపై మాజీ మంత్రులు మారెప్ప, గుమ్మనూర్ జయరాం, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్, మాజీ జడ్పీటీసీ దేవేంద్రప్ప, రామ్ భీంనాయుడు, మేకల భాస్కర్, మాజీ ఎంపీపీ రామ్‌నాథ్‌యాదవ్ తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. నిస్వార్థ రాజకీయాలకు ఆయన జీవితం ఓ ఉదాహరణ అని అన్నారు.

ఖరీఫ్ సాగుకు రుణ పరిమితి 15 శాతానికి పెంపు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు ఏటేటా పెరిగిపోతూనే ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు, తెగుళ్లతో పాటు ఎరువుల ధరలు క్రిమిసంహారక మందుల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో పంట సాగుకు అవసరమైన పెట్టుబడిని అందిస్తున్న బ్యాంకుల నుంచి రుణ పరిమితిని 15 శాతానికి పెంచేలా వచ్చే ఖరీఫ్‌లో రుణ ప్రణాళికను తయారు చేసేందుకు బ్యాంకర్ల కమిటీ కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కర్నూలు జిల్లాలో నాలుగున్నర లక్షల హెక్టార్లు, అదే విధంగా నంద్యాల జిల్లాలో రెండున్నర లక్షల హెక్టార్లలో పత్తి, వేరుశనగ, మిర్చి, ఉల్లి, కంది, ఆముదం మొక్కజొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులకు పంట పెట్టుబడి కోసం 8 వేల కోట్ల పంట రుణాలను అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే ఖరీఫ్‌లో 15 శాతాన్ని వివిధ పంటలకు పెట్టుబడి సాయంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు బుధవారం విలేకరులకు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ సమావేశం ఖరీఫ్ రుణ ప్రణాళికపై నిర్ణయం తీసుకుంటుందని, ఆ తర్వాత జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ రైతులకు అందించే రుణ పరపతిపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగాల మెరిట్ జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ అర్బన్ హెల్త్ సెంటర్‌లోని నాలుగు పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను బుధవారం ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఫార్మసిస్టు గ్రేడ్-2 పోస్టులకు 324 దరఖాస్తులు, నాలుగు డీఈవో పోస్టులకు 263, ఆరు ఎల్‌టీ పోస్టులకు 272, 9 ఎల్‌జీఎస్ పోస్టులకు 394 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలపాలని సూచించారు.

హోంగార్డుల సంక్షేమంపై దృష్టి

సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు చేపట్టామని సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని హోంగార్డు ఆఫీసులో 8 జిల్లాల హోంగార్డు ఇన్‌చార్జి పోలీసు అధికారులతో కమాండెంట్ మహేష్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమంపై తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆరా తీశారు. మృతి చెందిన కుటుంబాల పిల్లలకు కారుణ్య నియామకాలు, ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. హోంగార్డులు క్రమశిక్షణతో ఉంటూ పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పెండింగ్ లేకుండా అన్ని పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(ఏఆర్) కృష్ణమోహన్, ఏఎస్పీ (ఇంటెలిజెన్స్) ఆర్.రాఘవేంద్ర, డీఎస్పీలు కేవీవీఎస్ వి.ప్రసాద్, కేజేఎం చిరంజీవి, భాస్కర్‌రావు, ఆర్ఐ జావేద్, హోంగార్డ్స్ ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, పోతులరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.మహేష్ కుమార్

అవిశ్వాసమే నెగ్గింది

- ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దిగిపోయిన శాంత
- హాజరు కాని ఎమ్మెల్యే పార్థసారథి



అవిశ్వాస తీర్మానానికి ప్రిసైడింగ్ అధికారిగా హాజరైన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. 35 మంది కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటికి బుధవారం ఉదయాన్నే చేరుకున్నారు. వీరితో పాటు 30వ వార్డుకు చెందిన స్వతంత్ర అభ్యర్థి నాగరత్న కౌన్సిలర్‌తో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్ ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కూడా వచ్చారు. వీరందరినీ ప్రత్యేక వాహనంలో మున్సిపల్ కార్యక్రమానికి ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. ఈ సమావేశానికి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కార్యక్రమాన్ని నడిపించారు. హాజరైన 36 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. అనంతరం వైసీపీ నాయకులు సంబరాల్లో మునిగి తేలారు. ఇదిలా ఉండగా ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్‌గా శాంతను దించాలని గత నెలలో ఆదోనికి కౌన్సిల్ సభ్యులు కలెక్టర్‌ను కలసి అవిశ్వాసం ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత మున్సిపల్ చెర్ పర్సన్ శాంత కోట్ల కూడలిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి చైర్‌పర్సన్ శాంతకు మద్దతుగా నిలబడ్డారు. వైసీపీ నుండి వచ్చిన వలస కౌన్సిల్ సభ్యులతో మాజీ ఎమ్మెల్యేను కౌన్సిల్ సభ్యులను తిట్టించారని, వైసీపీ కౌన్సిల్ సభ్యులు చైర్ పర్సన్‌ను దించడం కోసం లక్షల రూపాయలకు అమ్ముడు పోయారని ప్రచారం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఇంటికి కౌన్సిల్ సభ్యులందరూ చేరుకున్నారు. వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ సమక్షంలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి యుక్తులు, కుయుక్తులతో నియోజకవర్గంలో ఆబద్ధాలను ఊదరగొట్టుకుంటూ, ఎన్ని కుట్రలు పన్నినా వాటన్నిటిని అధిగమించి, అవిశ్వాసంతో బీజేపీ ముసుగులో ఉన్న చైర్ పర్సన్‌ను దించేశామన్నారు. నేటితో నియోజకవర్గంలో పార్థసారథి రాజకీయ పతనం, కూటమి ప్రభుత్వం పతనం ప్రారంభమైందని అన్నారు. ఎమ్మెల్యే తన ఓటు, చైర్ పర్సన్, బీజేపీలో చేరిన ఇంకో నలుగురు కూడా ఓటు వినియోగించుకోలేక ముఖం చూపించలేక ఉడాయించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, ఆదోని నియోజకవర్గ వైసీపీ సభ్యులు, చైర్ పర్సన్‌లు, వైసీపీ కౌన్సిల్ సభ్యులు, సర్పంచుల పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్సీ మధుసూదన్



మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డులు అందుకుంటున్న కళాకారులు జీవీ శ్రీనివాస రెడ్డి, ఎర్రమ పాండురంగయ్య, ఎంఆర్ రాధిక, గాండ్ల లక్ష్మన్న, మంజుల, నంద్యాలకు చెందిన రామసుబ్బయ్య, శంభు ప్రసాద్, రత్నకుమార్

జిల్లా కళాకారులకు కందుకూరి పురస్కారాలు

కర్నూలు కల్చరల్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా, తెలుగునాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి కందుకూరి పురస్కారాలను జిల్లాకు చెందిన ఐదుగురికి ప్రదానం చేసింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన కందుకూరి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సినీ మాటల రచయిత బుర్ర సాయిమాధవ్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి నాయక్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. జిల్లాకు చెందిన ప్రముఖ హార్మోనిస్టు ఎర్రమ పాండురంగయ్య, సీనియర్ రంగస్థల నటుడు జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, రంగస్థల నటీమణులు ఎంఆర్ రాధిక, రామదుర్గం వనారస మంజుల పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు అందుకున్న కళాకారులను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మియా అభినందించారు.

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కందుకూరి అవార్డును డాక్టర్ గుర్రాల రవికృష్ణ అందుకోగా, రంగస్థల సంగీత దర్శకుడు పిఎస్ రత్నకుమార్, సీనియర్ రంగస్థల నటుడు నంద్యాల జిల్లా గోస్పాడు మండలం దీబగుంట్లకు చెందిన మంతం శంభుప్రసాద్, బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెకు చెందిన రామసుబ్బయ్యలు జిల్లా స్థాయి అవార్డులను అందుకున్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

• వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ల సంఖ్యాల బలం లేకపోయినా ఎమ్మెల్యే పార్థసారథి ప్రలోభాలకు గురి చేశారని, అయితే తమ కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయబావుట ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపాలిటీకి రూ.4.5కోట్లు నిధులు తెచ్చానని అబద్ధాలు చెప్పారన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీన్నిటికీ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ కింద విడుదల చేసిన నిధులని, అవి తానే తెచ్చినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అనంతరం కౌన్సిలరులు అందరూ వారిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసీపీ రాష్ట్ర నాయకుడు తెర్నేకల్లు సురేంద్ర రెడ్డి పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి, లోకేశ్వరి, రాజేశ్వర్ రెడ్డి, బాలాజీ, ఫయాజ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



పెద్దయ్య (ఫైల్)

మంత్రాలయం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పులు అధికమై ఓ రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంత్రాల యం మండలం సూగూరు గ్రామంలో జరిగింది. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ బంధువులు తెలిపిన వివరాల మేరకు సూగూరు గ్రామానికి చెందిన కురువ పెద్దయ్య (65) అనే రైతు ఐదేళ్ల నుంచి తనకున్న రెండున్నర ఎకరాల్లో మిరప, పత్తి సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. గత మూడేళ్ల క్రితం పక్షవాతంతో మంచాన పడ్డాడు. పొలంలో పత్తి, మిరప వంటి పంటలు సరిగ్గా పెట్టుబడి రాక, అప్పులు తీర్చే దారి లేక మంగళవారం ఇంట్లో ప్రమాదకర ద్రావణం తాగాడు. ఇరుగు పొరుగు వారు భార్యాపిల్లలకు సమాచారం ఇచ్చారు. ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతునికి దాదాపు రూ.15 లక్షలు అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య వీరనాగమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి రైతు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



రజియా (50)

చిప్పగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరులో పిడుగు పడటంతో రజియా (50)అనే మహిళ బుధవారం మరణించింది. ఏరూరులోని గ్రామ సచివాలయం వెనుక పొలంలో మిరపకాయలు వేరుచేస్తుండగా ఒక్కసారిగా వర్షం పడింది. ఇంటికి బయలు దేరుతుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. హుస్సేన్ సాబ్ రజియా దంపతులకు ఆరుగురు సంతానం. పనిచేసి కుటుంబాన్ని నడుపుతున్న తల్లి మృతితో పిల్లలు, బంధువులు విలపించారు. జడ్పీటీసీ సంఘం మాజీ అధ్యక్షుడు మీనాక్షినాయుడు, ఏరూరు చౌదరి, దామన్న బాధితులను పరామర్శించారు

బంగారు నగలు మాయం

కర్నూలు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వచ్చిన ఓ దంపతుల బంగారు ఆభరణాలు అదృశ్యం కావడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళగిరికి చెందిన శిరీష, నరసింహమూర్తి దంపతులు తమ బంధువులతో కలిసి ఈ నెల 12న కర్నూలులోని వెంకటరమణ కాలనీలో జరిగే ఓ పెళ్లికి హాజరయ్యారు. అదే రోజు నంద్యాల వెళ్లి అక్కడి నుంచి ట్రైన్‌లో విజయవాడ వెళ్లారు. 13వ తేదీ సాయంత్రం చూసుకుంటే ఆభరణాలు ఉన్న బ్యాగ్ జిప్ తెరిచి ఉంది. అందులో ఉన్న 30 తులాల బంగారు నగలు మాయమయ్యాయి. కర్నూలు వచ్చి విచారించుకున్నారు. టూటౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగరాజరావు తెలిపారు.

మోదీ కీలుబొమ్మలుగా దర్యాప్తు సంస్థలు

• నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాన దర్యాప్తు సంస్థలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయని నంద్యాల జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ జే.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ కేసును కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయ పరమైన అంశాలకు వాడుకుంటుందని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తుసంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీ, ఈసీ, ఐబీ, ఎన్‌సీబీ, సెబీ లను కేంద్ర ప్రభుత్వం పావులుగా ఉపయోగిస్తుందని విమర్శించారు. ముఖ్యంగా రాహుల్‌గాంధీకి దేశంలో పెరుగుతున్న ఇమేజీని తట్టుకోలేక ఈఅక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రముఖులైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమ కేసులు ప్రజాస్వామ్య వ్యవస్థపై బీజేపీ చేస్తున్న దాడిలో భాగమేనన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా భయపడేది లేదని, ప్రజల మేలు కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పఠాన్ అబుఖాన్, నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, షేక్‌రజాక్‌వలి, చెన్నయ్య, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

రిజర్వాయర్లను నింపడంలో అధికారులు విఫలం

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలో డ్యాంలో నీటి మట్టం పెరిగినా రిజర్వాయర్లు, చెరువులను నిపండంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు చొరవ తీసుకుని అన్ని రిజర్వాయర్లను నింపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. రైతులకు రబీ,ఖరీఫ్ సీజన్లో నీరు అందించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. కేసీ కెనాల్ కింద పంటలు ఎండిపోయినట్లు ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలను చైర్మన్ అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఇంత జరుగుతున్న రైతులను ఎందుకు విస్మరిస్తున్నారని చైర్మన్ మండిపడ్డారు.

రేషన్ దుకాణాల నుంచి అన్ని రకాల నిత్యావసర వస్తువులు రావడం లేదని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న అన్నారు. తుగ్గలి మండలంలో మినీ గోకుల షెడ్లు కేవలం పచ్చచొక్క ఉన్నవారికే మంజూరు చేస్తున్నారని, పాడిపశువులు లేని వారికి కూడ ఎలా మంజూరు చేస్తారని జడ్పీటీసీ పులికొండ నాయక్ అధికారులను ప్రశ్నించారు. కర్నూలు నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారికి ఇరువైపులా బస్‌షెల్టర్లు ఎందుకు ఏర్పాటు చేయలేదని జడ్పీటీసీ రంగనాథగౌడు ప్రశ్నిం చారు. గడివేముల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పక్కన రోడ్డు ని ఆక్రమించుకుని దుకాణాలు, భవనాలు నిర్మించారని తక్షణమే వాటిని తొలగించాలని గడివేముల జడ్పీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీలు సుంకన్న, రంగనాథగౌడు, సుంకన్న పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల అధకారులు పాల్గొన్నారు.

ప్రశ్నించేవారే కరువు

జిల్లాలోని వివిధ మండలాల్లో నెలకొన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన జడ్పీటీసీలు కరువయ్యారు. ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరగ్గా అందులో కోరం లేకుండానే సమావేశాలను మమ అనిపించారు. చివరికి కోరం లేకపోవడంతో 4,6 స్థాయి సంఘ సమావేశాలను సాయంత్రానికి వాయిదా వేసి తూతూ మంత్రంగా నిర్వహించారు.

దళితుల అభ్యున్నతే లక్ష్యం

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నా రు. బుధవారం మండలం లోని హుశేనాపురం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశార న్నారు. ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. గతంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదికపై మంత్రులు వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయిం చిందన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉప వర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉప కులాలకు ఒక శాతం, గ్రూపు-2లో 18 ఉప కులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో 29 ఉప కులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదం తెలిపిందన్నారు. అన్ని జిల్లాలో ఈ ఆర్డినెన్స్ అమలులోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. నాటి ప్రభుత్వం జీవోను వ్యతిరేకిస్తూ మాలమహానాడు హైకోర్టులో కేసు వేయడంతో 1997 సెప్టెంబరు 16న హైకోర్టు నిలుపుదల చేస్తూ తీర్పునిచ్చిందన్నారు. ఈ జీవో ప్రభుత్వ భర్తికి మించిందని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ జీవో అమలును నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, గువ్వ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు

• 20 నుంచి టీజీవీ కళాక్షేత్రంలో వేడుకలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో 'నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సాంస్కృతిక వారోత్సవాలు ఈనెల 20 నుంచి 26 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు వేసవి వినోద వల్లరిగా కొనసాగుతాయని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ఆట, పాట, మాట, పద్యం పేర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈనెల 20న కళారత్న ఆముదాల మురళిచే అష్టావధానం, 21న 'జగదేక సుందరి సామా' పద్య నాటక ప్రదర్శన (దర్శకత్వం పత్తి ఓబులయ్య), 22న 'శ్రీకృష్ణ కమలపాలిక' పద్య నాటక ప్రదర్శన (రచన దివంగత పల్లేటి కులశేఖర్, దర్శకత్వం పత్తి ఓబులయ్య), 23న 'తరమెల్లిపోతున్నది' సాంఘిక నాటక ప్రదర్శన (దర్శకత్వం కె. రామకృష్ణ, గుంటూరు), 24న 'సినిమా, జానపద, గజల్స్, సంగీత విభావరి' (నిర్వహణ సుధారాణి, మహమ్మద్ మియా), 25న 'శాస్త్రీయ, జానపద, నృత్యలహరి' ప్రదర్శనలు (నిర్వహణ నాట్యాచార్యులు ఎస్. కరీముల్లా, రోహిత్, ప్రదీప్, నారాయణస్వామి), 26న 'శ్రీవేంకటేశ్వర మహాత్యం' పౌరాణిక నాటకం (దర్శకత్వం వీవీ రమణారెడ్డి) ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా వివరించారు.

అంతర్రాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్టు



నిందితులు, డీజిల్, వాహనాలతో డీఎస్పీ హేమలత, పోలీసులు

• రూ.10లక్షలు, నాలుగు కార్లు స్వాధీనం
• 11 మంది అరెస్టు
• ఇద్దరు నిందితుల పరారీ
• వివరాలు వెల్లడించిన డీఎస్పీ హేమలత

ఆదోని , ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో పెట్రోల్ బంకుల వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీల్లో డీజిల్‌ను దొంగిలిస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను ఆదోని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. డీఎస్పీ హేమలత, వన్ టౌన్ సీఐ శ్రీరామ్, టూటౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు.

పట్టణానికి చెందిన మైల రామకృష్ణ, సర్దార్ బాషా, సయ్యద్ సమీర్ డీజిల్ దొంగతనాలు చేస్తున్నారంటూ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2025 ఏప్రిల్ 8వ తేదీన ఫిర్యాదు చేశారు. నిలబెట్టిన లారీల డీజిల్ ట్యాంకు నుంచి వందల లీటర్లు, డీజిల్‌ను దొంగిలిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆదోని వన్‌టౌన్‌లలో నాలుగు కేసులు, ఆదోని టూటౌన్‌లో ఒకటి ఆలూరులో ఒక కేసు నమోదయింది. ఫిర్యాదు స్వీకరించిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ డీజల్ దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచి తనదైన శైలిలో దర్యాప్తును వేగవంతం చేశారు. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లాకు చెందిన రమేష్ నాయక్ అలియాస్ చోటా నాయక్, దేగావత్ పాండు నాయక్, దేగావత్ పాపా నాయక్, దేగావత్ రవి నాయక్, దేగావత్ మహేష్ నాయక్, సభావాత్ కిషన్ నాయక్, పాల్తీయ రవి నాయక్, సభావత్ రవి నాయక్, చవాన్ సురేష్ నాయక్, కృష్ణా నాయక్, మహబూబ్ మండలానికి చెందిన రామావత్ రవికుమార్ రాథోడ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి దగ్గర నుంచి రూ.10.30లక్షల నగదును 350 లీటర్ల డీజిల్, నాలుగు ఫోర్‌వీలర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు.

అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలానికి చెందిన బజారా మహేష్ నాయక్, వర్తియా రవి నాయక్,లులో భాస్కర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి ఈ ముఠా డీజల్ దొంగతనాలు చేస్తూ జల్సాలు చేస్తున్నారని తెలిపారు. సీసీ పుటేజీల ద్వారా చిన్న క్లూ దొరికిందని, తీగ లాగితే దొంగ కదలినట్లు పెద్ద ముఠానే దొరికిందన్నారు. వారిని పట్టుకుని విచారించగా డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నామని అంగీకరించారన్నారు. దీంతో వారి నుంచి రూ.10.30 లక్షలతో పాటు 350 లీటర్ల డీజిల్, 10 ఖాళీ క్యాన్లను, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ హేమలత తెలిపారు. సీఐ శ్రీరామ్, సిబ్బందిని అభినందిం చారు. ఎస్పీ చేతులమీదుగా రివార్డు అందజేసేందుకు సిఫారసు చేస్తానని డీఎస్పీ అన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించేలా కృషి చేస్తా: మంత్రి


టీజీ భరత్‌కు వినతిపత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా కృషి చేస్తానని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం మంగళగిరిలోని మంత్రి కార్యాలయంలో నగర బలిజ సంఘం గౌరవ సలహాదారు గాజుల వెంకట విజయభాస్కర్, డాక్టర్ సింగంశెట్టి సోమశేఖర్‌లు కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో శ్రీకృష్ణదేవ రాయలు జయంతిని నిర్వహించేదని, ఇటీవల ప్రకటించిన ప్రభుత్వ ఉత్సవాల జాబితాలో శ్రీకృష్ణదేవరాయలుకు సంబంధించిన ఉత్సవా లు లేకపోవడం బాధాకరమన్నారు. దీనిపై స్పందించిన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో శ్రీకృష్ణదేవరాయలు పేరు లేకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉందని, ఏదో సాంకేతిక సమస్యతోనే ఇది జరిగి ఉంటుందని చెప్పారు. వెంటనే తన ఓఎస్‌డీని పిలిచి, ఆ వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓకు) పంపించాలని ఆదేశించారు.

డ్రోన్‌పై అవగాహన ఉండాలి: వీసీ

కర్నూలు, అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు ప్రతి ఒక్కరు డ్రోన్ నైపుణ్యం కలిగి ఉండటం వల్ల ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని, అవగాహన ఉండాలని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. బుధవారం క్లస్టర్ వర్సిటీలో తిహన్ పౌండేషన్ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఐఐటీ డీఎం కర్నూలు ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ 50 మంది ఎస్సీ విద్యార్థులకు డ్రోన్ బ్యూరో క్రాట్‌ఉచిత శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమం రిమోట్లీ అపరేటెడ్ వెహికల్స్ డ్రోన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 20 వరకు ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలు టెక్నాలజీ గురించి అవగాహన పెరిగి కొత్త విషయాలు తెలుసుకోవాలన్న దానిపై అసక్తి పెరుగుతుందన్నారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ దేవీకారాణి, డీన్ అక్తర్ భాను, కన్వీనర్ మహమ్మద్, వాయిజ్, శ్రీలక్ష్మణ్ గుప్తా, ట్రిబుల్ ఐటీ అధ్యాపకులు డాక్టర్ కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి వంద శాతం సబ్సిడీ

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రైతులు పండ్లతోటల పెంపకం చేపట్టేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ అందిస్తుందని డ్వామా పీడీ వెంకట రమణయ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పండ్ల తోటలతోపాటు మల్లె, గులాబి పూల తోటలను పెంచుకుని సుస్థిర ఆర్థిక అభివృద్ధిని పొందేందుకు చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. అదేవిధంగా చింత యాపిల్ బేర్ డ్రాగన్ ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబీ పూల సాగు, మనగ తోటలకు ప్రభుత్వం రెండు సంవత్సరాల సాగుకు సంబంధించి ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు రైతులు జాబ్‌కార్డు కలిగి ఉండాలని, ఐదెకరాల్లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు అర్హులు అని, బోరు, బావి కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈ పథకాలలో అర్హులుగా చేరేందుకు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, మండల కార్యాలయాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మార్కెట్ యార్డులో తనిఖీలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో బుధవారం తూనికలు, కొలతలు, పౌరసర ఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, కాటాలు సక్రమంగా వినియోగిస్తున్నది లేనిది తనిఖీలు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా వారిని ఆదేశించారు. కొన్ని ఎలక్ట్రానిక్ కాటాలు సక్రమంగా నిర్వహణలో లేకున్నా, వాటినే వినియోగిస్తూ రైతులను మోసగిస్తున్నారనే ఆరోపణలు ఇటీవల వెలువెత్తాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాజా రఘువీర, తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, వారి సిబ్బంది కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన వేరుశనగకాయలు, కందులు, మొక్కజొన్న, తదితర పంట ఉత్పత్తులు కమీషన్ ఏజెంట్లు తూకం వేసే సమయంలో పరిశీలించారు. వీరి వెంట మార్కెట్ కమిటీ సెక్ర టరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పీజీ పరీక్షల పరిశీలన

కర్నూలు, అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పీజీ 4వ సెమిస్టర్ పరీక్షలను ఉపకులపతి వి.వెంకట బసవరావు బుధవారం పరిశీలించారు. దివ్యాంగులకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఇన్విజిలేటర్లను ఆదేశించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగం కంట్రోలర్ నాగరాజుశెట్టి, బాల సుబ్రహ్మణం ఉన్నారు.

సి.బెళగల్ ఎస్ఐగా పరమేష్ నాయక్

సి.బెళగల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ ఎస్ఐగా పరమేష్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాగే మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. టీడీపీ నాయకులు జిక్రియ, సోమన్న, రాముడు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దస్తగిరి హాజరై మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో బోర్లు, విద్యుత్ మోటార్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు మురుగు కాలువలలో ఉంటే వాటిని తొలగించాలన్నారు. మండలంలోని వైద్యులు విధులకు ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో రాణెమ్మను ఆదేశించారు. ఈసమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికా రులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం చేయించుకోండి: టీడీపీ కార్యకర్తలు పార్టీ సభ్యత్వం చేయించుకోవాలని ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో మాజీ జడ్పీటీసీ చంద్ర శేఖర్ అధ్యక్షతన టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వం కార్డులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప, విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు బీమన్న, ఎంపీటీసీలు ఈరన్నగౌడు, ధనంజయుడు, అమర, సర్పంచులు పాల్గొన్నారు.

శతాబ్ది బ్రహ్మోత్సవాల నిర్వహణ అభినందనీయం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని పేట శ్రీరామాలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. గత ఐదు రోజులుగా ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాతనగరంలో బుధవారం రాత్రి సీతారామచంద్ర, లక్ష్మణ స్వామి ఉత్సవ విగ్రహాలతో భారీ దివ్య మంగళ రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని టీజీ వెంకటేశ్ పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేట రామాలయ అభివృద్ధికి మంత్రి టీజీ భరత్ తనవంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆలయంలో అన్నప్రసాద దాత, కేవీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, అఖిల భారత కరివేన నిత్యాన్నదాన సత్రం జిల్లా కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుకూరు ప్రభాకర్, లలితాపీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వెల్దుర్తి ఆంజనేయ స్వామి, వీహెచ్‌పీ నాయకులు ప్రాణేశ్, మాళిగి భానుప్రకాశ్, ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

● **వైభవంగా స్వామివారి కల్యాణం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో వివిధ ప్రాం తాలకు చెందిన బ్రాహ్మణ పండితులు, అశేష భక్తులు పాల్గొన్నారు. రాత్రి జరిగిన స్వామివారి దివ్య మంగళ రథోత్సవ ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపులో లలితాపీఠం, గోదా గోకులం, విష్ణు సహస్రనామ పారాయణం బృందం, శ్రీబాలాజీ సేవా ట్రస్టుల తోపాటూ పరిసర గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొ న్నాయి. బాలికల కోలాటాలు, మహిళల ఢమరుక నృత్యాలు, యువత నందికోళ్లసేవ, విజ్ఞానపీఠం విద్యార్థుల చెక్కభజనలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో దినేష్ చౌదరి, ప్రధాన అర్చకులు మాళిగి హనుమేషాచార్యులు, వేద వ్యాసాచార్యులు, రాఘవేంద్రమూర్తి, విద్యానిధి ఆచార్యులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న టీజీ వెంకటేశ్, చెక్క భజన చేస్తున్న విజ్ఞానపీఠం బాలురు

ఒకేషనల్ విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానించిన ఆర్ఐవో గురువయ్యశెట్టి, ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఒకేషనల్ విద్యార్థులను ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, ప్రిన్సిపాల్ డా.ఎస్ నాగస్వామి నాయక్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కృషిని వారు అభినందించారు. ఉత్తీర్ణత 82 శాతం పొందడానికి కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులను, తల్లిదండ్రులను ఆర్ఐవో అభినందించారు. ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ ఇంటర్ రెండో సంవత్సరంలో 173 మందికి గానూ 142 మంది పాసై 82.08 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే ప్రథమ సంవ త్సరం పరీక్షలో 238 మందికి గానూ 173 మంది పాసై 73 శాతం ఉత్తీ ర్ణత సాధించారన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటుపరం చేస్తుందని విమర్శించారు. దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి సీహెచ్. సాయిబాబా, ప్రభాకర్, ఎం.వెంకటేశ్వర్లు, మహ్మద్ రఫి పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో కర్నూలుకు రజతం

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కళాశాల స్టేడియంలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల రగ్బీ పోటీల్లో కర్నూలు పురుషుల జట్టు రజతం కైవసం చేసుకుంది. కాగా నెల్లూరు జట్టు విన్నర్‌గా నిలిచిందని రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. జిల్లా జట్టు రజతం సాధించడంపై జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ సంతోషం వ్యక్తం చేశారు.

నిరసనను జయప్రదం చేయండి

కర్నూలు రూరల్ ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు-1డిపో ఎదుట గురువారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్, రీజనల్ కార్యదర్శి సి.మద్దిలేటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ప్లకార్డులతో నిరసన చేయనున్నట్లు ఆయన వివరించారు.

నూతన కార్యవర్గంలో జిల్లాకు ప్రాధాన్యం


ఏలూరు బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న హెచ్‌కే మనోహర్‌రావు, కళ్లే చంద్రశేఖర శర్మ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నూతన కార్యవర్గంలో కర్నూలు జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హెచ్‌కే మనోహర్‌రావు అన్నారు. ఏలూరు పట్టణంలోని హోటల్ అంబికా ఫ్లేవర్స్‌లో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరా కార్యక్రమం మంగళవారం రాత్రి నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కోనూరు సతీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన హెచ్‌కే మనోహర్‌రావు, సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా కర్నూలుకు చెందిన కళ్లే చంద్రశేఖర శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇస్కాల సురేష్‌కుమార్, యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా పెనుగొండ సుందర రామశర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సంబరాజు దుర్గాప్రసాద్, కొత్తపల్లి శ్రీనాథ్‌లు ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌కే మనోహర్‌రావు మాట్లా డుతూ పేద బ్రాహ్మణుల పురోభివృద్ధి అన్ని వేళలా సమాఖ్య కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళ్లే చంద్రశేఖర శర్మ టీవీపీ నేత, అంబికా దర్బార్ బత్తి గ్రూప్స్ అధినేత అంబికా కృష్ణ, బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జి పాల్గొన్నారు.

ప్లాట్‌ఫారాల్లోకి రైతుల మిర్చి నిల్వలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మిర్చి పంటను సాగు చేసిన రైతులకు మేలు చేకూర్చే దిశగా కర్నూలు మార్కెట్ కమిటీ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆంధ్రజ్యోతిలో 'వ్యాపారికి అండ.. రైతుకు ఎండ' అనే కథనంపై అధికారులు స్పందించారు. బుధవారం కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు నాగేష్, కేశవరెడ్డి, శివన్న మిర్చి యార్డును తనిఖీ చేశారు. వ్యాపారులు నిల్వ చేసిన ఎండు మిర్చిని పరిశీలించారు. తక్షణమే మిర్చి నిల్వలను వేరే చోటకు తరలించాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించి వారు అమ్మకానికి తెచ్చిన మిర్చిని ప్లాట్‌ఫారాల్లోకి నిల్వ చేసేలా చర్యలు తీసుకున్నారు.

టీడీపీకి కార్యకర్తలే అండ

ఓర్వకల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే అండ అని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులో టీడీపీ కార్యకర్తలకు ఆయన సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు, శ్రీరాములు, అయూబ్ బాషా కురువ సుంకన్న పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించండి

ఓర్వకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని బైరాపురం, లొద్దిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలిం చారు.

తప్పుడు కేసులతో భయపెట్టలేరు: కాంగ్రెస్

కర్నూలు, అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులతో సోనియా, రాహుల్ గాంధీలను భయపెట్టలేరని సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జీలాని అన్నారు. బుధవారం ఏఐసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్యమేవ జయతే నిరసన కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, అనం తరత్నం మాదిగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, సాంబశివుడు ప్రమీల, సయ్యద్ ఖాద్రీ పాషా పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణను ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ముస్లింలంతా వ్యతిరేకిస్తున్నారని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ చట్టంతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని మొరపెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకులు అర్థం చేసుకోవడం లేదన్నారు. ముస్లింల హక్కులను కాలరాసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. వైసీపీ వక్ఫ్ బోర్డు చట్టాన్ని వ్యతిరేకించి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామన్నారు.

వైభవంగా దేవర

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



అమ్మవారికి పూజలు చేస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, దేవరలో పాల్గొన్న గౌరు వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో బుధవారం పెద్దమ్మ దేవరను వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా వేడుకల్లో భాగంగా మంగళవారం గ్రామ పెద్దలు అమ్మవారి విగ్రహానికి పూజలు చేశారు. బుధవారం ఉదయం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆయా పార్టీల నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, తిప్పా యపల్లె సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, గోవిందరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మీదివేముల ప్రభాకర్ రెడ్డి, రంగనాథగౌడు, తిప్పన్న, పుల్లారెడ్డి, హరినాథరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమాల తనిఖీ

కర్నూలు లీగల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బుధవారపేటలోని సాయి అనాథ ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. ఆశ్రమంలోని నిరాశ్రయులను ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనాథ ఆశ్రమంలోని రికార్డులను తనిఖీ చేయడానికి అడుగగా నిర్వాహకులు రికార్డులు లేవని చెప్పడంతో ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్థానిక పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వెనుకాల ఉన్న హోం ఆఫ్ హోం అనాథాశ్రమాన్ని కూడా తనిఖీ చేశారు. ఆశ్రమంలో అందిస్తున్న భోజన వసతి గురించి బాలలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాయపాటి శ్రీనివాసులు ఉన్నారు.

మొక్కజొన్న కంకులు బుగ్గిపాలు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్న కంకులు కాలి బూడిదయ్యాయి. వివరాలు.. వుశేన్న అనే రైతు రెండెకరాల్లో మొక్కజొన్న కంకులు కోత జరిపించి గ్రామ సమీపాన ఆరబెటాడు. బుధవారం మధ్యాహ్నం మొక్కజొన్న కంకుల నుంచి పొగలు వస్తుండటంతో అటుగా వెళ్తున్న కొందరు రైతుకు సమాచారం అందించారు. రైతు, కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటను ఆర్పి వేశారు. అప్పటికే సుమారు 4 ట్రాక్టర్ల మొక్కజొన్న కంకులు, టార్పాలిన్ పట్టాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో సుమారు రూ. 1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు లబోదిబోమన్నాడు. గురువారం కంకులు యంత్రం పట్టించాలనుకు న్నామని, ఈలోగా ప్రమాదం జరిగిందని వాపోయాడు.

ఘనంగా 'కందుకూరి' జయంతి


తిరుపాలును సత్కరిస్తున్న హనుమంతరావు చౌదరి తదితరులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు నాటక రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని బుధవారం నగరంలోని జిల్లా కళాకారుల ఐక్య వేదిక కళాకారులు ఘనంగా నిర్వహించారు. ఐక్య వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కందుకూరి చిత్ర పటానికి పలువురు కళాకారులు పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా జిల్లాలో సీనియర్ రంగస్థల కళాకారుడు తిరుపాలును సత్కరించారు. హనుమంతరావు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు ఎడ్యుకేషన్: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం ప్రభుత్వ టౌన్ మోడల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు వైవిధ్యంగా పచ్చదనం పరిశుభ్రత పేరుతో ర్యాలీ నిర్వహించారు. మెరుగైన సమాజం కోసం ఆయన చేసిన కృషిని తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై ప్రసంగించారు.

శ్రద్ధగా చదవాలి


సింధూజకు మెమెంటోను అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు శ్రద్ధగా, నిబద్ధతతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వాసవీ మహిళా కళాశాల యాజమాన్యం సోమిశెట్టి వెంకట్రామయ్య అన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన వివిధ గ్రూపుల విద్యార్థినులకు యాజమాన్యంతోపాటు, కళాశాల సలహాదారుడు పి.లింగేశ్వరరెడ్డి, అధ్యాపకుల చేతుల మీదుగా మెమొంటోలు అందజేశారు. ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ చదువుతున్న బోయ సింధూజ 469/500 సాధించింది.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే గౌరు చరిత


డీజీపీకి పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత పూలమొక్క ఇచ్చి పలు అంశాలపై చర్చించారు. పాణ్యం నియోజకవర్గంలో శాంతిభద్రతలపై విషయంపై డీజీపీతో మాట్లా డారు. అదేవిధంగా మంగళవారం విజయవాడ సెక్రటేరియట్‌లో భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన చాంబర్‌లో గౌరు చరిత కలిశారు. పాణ్యం నియోజకవర్గంలోని తాగు, సాగునీటి కీలక ప్రాజెక్టులపై చర్చించారు.

ఈకేవైసీ తప్పనిసరి: తహసీల్దార్

గూడూరు ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గూడూరు తహసీల్దార్ కే.రామాంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

కర్నూలు క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు కోర్టు జరిమానా విధించింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు త్రీటౌన్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఒక్కొక్కరిపై రూ.10వేలు జరిమానా విధించింది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 18 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించింది.

అడుగుకో గుంత



రహదారిపై ఉన్న గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

● దొల్లాపురం - గుంతకల్లు రహదారి దుస్థితి

చిప్పగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొల్లాపురం-గుంతకల్లు రహదారిలో అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. చిన్న వర్షానికే గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 5 కి.మీ.లు ప్రయాణించాలంటే గంట పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల నుంచి మరమ్మతులు చేయకపోవడంతో దారుణంగా దెబ్బతిందని అంటున్నారు. తమకు ఇదే ప్రధాన రహదారి అని, వందలాది మంది ప్రయాణిస్తుంటారని మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వెల్‌లెస్ సెంటర్

● ఆయుష్మాన్ భారత్ సెంటర్ చుట్టూ అపరిశుభ్రత



పందులు, అపరిశుభ్రత నడుమ ఆసుపత్రి

మద్దికెర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలోని సచివాలయం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉంది. చెత్తాచెదారం, డ్రైనేజీ ఉండటంతో పందులకు నిలయంగా మారింది. చుట్టూ ముళ్లకంప ఉండటంతో ఆసుపత్రికి రావడానికి రోగులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ మురుగు రాకుండా చేస్తామని, ముళ్లకంప తొలగిస్తామని, పందుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చామని వివరణ ఇచ్చారు.

21న ప్రవేశ పరీక్ష

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవరావు బుధవారం తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఆలూరు మోడల్ స్కూల్‌లో పరీక్ష ఉంటుందని, విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలన్నారు. హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు మే 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూసార పరీక్ష చేయించాలి



మట్టిని సేకరిస్తున్న సిబ్బంది

మద్దికెర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్ష చేయిస్తే మట్టిలోని సూక్ష్మధాతు లోపాలను నివారించుకోవచ్చని ఏవో రవి తెలిపారు. బుధవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో భూసార పరీక్షలు చేశారు. ఏఈవో జాకీర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

తుగ్గలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు, కార్మిక సంఘం నాయకుడు రంగరాజు కోరారు. బుధవారం మారెళ్ల సచివాలయం వద్ద ఆందోళన చేసి, అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కూలీలకు గడ్డపార, పలిక, గంపలు, తదితర పనిముట్లు ఇవ్వాలన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న మనోహర్ చౌదరి

తుగ్గలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. బుధవారం రాతనలో టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కార్యకర్తల అభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. కృష్ణమూర్తి చౌదరి, మైరామయ్య, లక్ష్మన్న, సంజీవ, బురుజుల శ్రీనివాసులు, పూజారి దేవేంద్ర, కోటేశ్వర చౌదరి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి ఖాద్రి

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి ఖాద్రి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని కోయనగర్‌లో బుధవారం గ్యాస్ ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్షంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

గొప్ప సంఘ సంస్కర్త 'కందుకూరి'



నివాళి అర్పిస్తున్న అరసం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘసంస్కర్త అని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రభాకర అన్నారు. బుధవారం కందుకూరి 177వ జయంతిని కిడ్డీస్ పాఠశాలలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కల్యాణి ఆయుధంగా మలుచుకొని సామాజిక దురాచారాలపై యుద్ధాన్ని ప్రకటించి నవ సంస్కరణకు కృషిచేసిన మహనీయుడని అన్నారు. పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, అరసం నాయకులు రామాంజినాగన్న, మల్లికార్జున వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు

ఆస్పరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ ఆలూరు తాలూకా అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఉరుకుందప్ప, రవి, హనుమంతు, గోపాల్, మల్లి పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ



సర్టిఫికెట్ ఇస్తున్న ప్రిన్సిపాల్ గౌసియా

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ గౌసియా ఖానమ్ తెలిపారు. బుధవారం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. ఆరో తరగతి విద్యార్థి దాత్రి ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. ఏజీఎం సురేష్, రంగారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

● టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్

ఆలూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. రాయలసీమ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకున్నారని చెప్పారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాయితీ యంత్ర పరికరాలకు రూ.80లక్షలు మంజూరు చేసిందని అన్నారు. ఏడీఏ సునీత, ఏవోలు వెంకటేశ్వర్ గౌడ్, శివ శంకర్, కన్వీనర్ అశోక్ యాదవ్, ఏఎంసీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కిష్టప్ప, అగ్రో ఎంటర్‌ప్రైజ్ యండి దేవరాజ్, టీడీపీ జిల్లా నాయకులు నరసప్ప, సురేందర్ నాయుడు, సోమశేఖర్ నాయుడు, కేశన్న, రాము యాదవ్, వడ్డె రమేష్, ఆలూరు గుండయ్య పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



ఎడవలి మార్గంలో నేలకొరిగిన చెట్టు

మద్దికెర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, ఎడవలి గ్రామాల్లో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లు కూలిపోయి, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎడవలి రహదారిలో ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి, అలాగే విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

డీఐజీని కలిసిన వైకుంఠం శివప్రసాద్



డీఐజీతో వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌ను బుధవారం టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు జ్యోతి కర్నూలులో కలిశారు. ఆలూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలను అదుపులో ఉంచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

ఆదోని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ప్రతిభ చూపిన నిర్మలకు అండగా ఉంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్మలను సన్మానించారు. ఉన్నత చదువుకు ఆర్థికంగా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాలికకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నిర్మలకు నాటి కలెక్టర్ సృజన ఫోన్

ఆదోని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో 966 మార్కులు సాధించిన కస్తూర్బా విద్యార్థిని నిర్మలకు నాటి కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన ఫోన్ చేసి మాట్లాడారు. ప్రస్తుతం సృజన తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారు. నిర్మల గురించి ఆమె ఆరా తీసి బుధవారం ఉదయం 6.30గంటలకు విద్యార్థినితో ఫోన్‌లో అభినందించారు. భవిష్యత్తులో ఏం చదవాలనుకున్నావు అనిఅడగా, నిర్మల తాను బీపీ చదవాలనుకున్నానని తెలిపింది. వివరాలకు కనుక్కుని మంచి కాలేజీలో చేర్పిస్తానని కలెక్టర్ ఆమెకు హామీ ఇచ్చింది. అనంతరం నిర్మల మాట్లాడుతూ సృజన మేడమ్‌తో మాట్లాడడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపింది.

ప్రతిపక్షహోదా ఇస్తేనే అసెంబ్లీకి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష నాయకుడిగా ఇస్తేనే అసెంబ్లీకి వెళతామని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం దేవనకొండలో మాట్లాడుతూ కూటమి నాయకులు వాల్మీకి రిజర్వేషన్ బిల్లును చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. దివాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు : సీఐ

తుగ్గలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): క్రికెట్, ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడితే చర్యలు తప్పవని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ హెచ్చరించారు. బుధవారం తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ బెట్టింగుల జూదాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

● సినీ ఫైట్‌మాస్టర్లు రామ్‌లక్ష్మణ్



ర్యాలీని ప్రారంభిస్తున్న రామ్‌లక్ష్మణ్‌లు

పత్తికొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత వస్తుందని సినీ ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్‌లు అన్నారు. మండలంలోని హోసూరులో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలో శాకాహారంపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పిరమిడ్ ధ్యాన

సారా విక్రేతల అరెస్టు

పత్తికొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ముగ్గురు సారా విక్రేతలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. బుధవారం తుగ్గలి మండల రాంపల్లి గ్రామానికి చెందిన రంగప్ప, మారెళ్ల గ్రామానికి చెందిన సోమశేఖర్, గోవిందు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

పేరు ఉన్నవారే రావాలి

మద్దికెర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు మస్టర్‌లో పేరు ఉన్నవారే పనికి రావాలని, ఒకరి పేరుతో మరొకరు రాకూడదని ఏపీవో నర్సిరెడ్డి సూచించారు. బుధవారం పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. మేటీలు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో గంధం

చిప్పగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరిలో భంభం బాబా గంధం ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం డాక్టర్ ఆదిలుద్దీన్ ఖాదిరి ఆధ్వర్యంలో సయ్యద్ సత్తార్ స్వామి దర్గా నుంచి భంభం స్వామి దర్గా వరకు ఊరేగించారు. అనంతరం దర్గాలోని సమాధులకు గంధాన్ని అలంకరించారు. ఎమ్మెల్యే విరుపాక్షి స్వామిని దర్శించుకున్నారు.

డిప్యూటీ ఎంపీడీవో హోదా ఇవ్వడంపై హర్షం

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈవోఆర్డీలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా హోదా కల్పించడం పట్ల ఎంపీడీవో మహబూబ్ బాషా, ఇన్‌చార్జి ఈవోఆర్డీ ప్రభాకర్ రావ్ హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ జీవో నెం. 35ను విడుదల చేశారన్నారు.

ఇస్వీ ఎస్ఐగా నాయక్



ఆదోని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్వీ ఎస్ఐగా డాక్టర్ నాయక్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. పోలీసు అధికారులు ఇక్కడి ఎస్ఐ నాగేంద్రను వీఆర్‌కు పంపగా, ఎమ్మిగనూరు టౌన్ ఎస్ఐగా ఉన్న డాక్టర్ నాయక్‌ను ఇక్కడికి నియమించారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి, క ర్ణాటక మద్యం, బెల్టుషాపుల నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో మంచినీటి బోరు



గ్రామంలో బోరు వేస్తున్న సిబ్బంది

పత్తికొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు ఆదేశాలతో మండలంలోని చక్రాళ్ల గ్రామంలో తాగునీటి బోరు వేశారు. గ్రామంలో తాగునీటి కొరత ఉండని బోరు ఎండిపోయిందని, టీఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిరాయుడు ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం గ్రామంలో నూతనబోరు వేసి సమస్యను పరిష్కరించారు.

నీరందించాలి

మద్దికెర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని నేషనల్ వాటర్ ఎక్స్‌పర్ట్ (ఎన్‌డబ్ల్యూఈ) ఎం.మాధవేశ్వరన్ అన్నారు. బుధవారం మద్దికెరలో రూ.1.84 కోట్లతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ అండర్ ట్యాంకు పనులను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడకుండా చూడాలన్నారు. తాగునీటి పథకాలు మరమ్మతులు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్ ఖాన్, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, ఏఈ మయాంక్ ఉన్నారు.

బీజేపీ ప్రతీకార రాజకీయాలు

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని బీజేపీ ప్రతీకార రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈడీ అధికారులు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్లో చేర్చడంపై మండిపడ్డారు.

పాండవగల్లులో బాల్య వివాహాలు

● మూడు జంటలకు పెళ్లి ● కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు

ఆదోని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పాండవగల్లు గ్రామంలో బుధవారం బాల్య వివాహాలు జరిగాయి. గ్రామంలో నాలుగు పెళ్లిళ్లు జరుగుతున్నాయని, అందులో మూడు జంటలు మైనర్లేనని కొందరు గ్రామస్థులు ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసెస్ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు పోలీసులతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే మైనర్లకు వివాహమైంది. అధికారులు వారి కుటుంబ సభ్యులను హెచ్చరించారు. మైనర్లను వివాహం చేస్తే జైలుకు పంపిస్తామన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన పెళ్లి బృందం వారు అధికారులపై ఎదురు తిరిగారు. అనంతరం పెళ్లి జంటలకు, వారి తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వద్ద హాజరు కావాలని అధికారులు సూచించారు. అప్పటి వరకు పెళ్లి కూతుళ్ళ, పెళ్లి కొడుకులు ఎవరి ఇంట్లో వారు ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శారద, లీగల్ అడ్వైజర్ శ్రీలక్ష్మి, సీడీపీవో ఉమామహేశ్వరి, రూరల్ సీఐ నల్లన్న, పెద్దతుంబలం ఎస్ఐ మహేష్ కుమార్, సూపర్‌వైజర్ సావిత్రి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య



ఆలూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 203 గ్రామాలకు అమృత ధార (జల జీవన్ మిషన్) పథకం ద్వారా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, ఇందుకు రూ.690 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య అన్నారు.

ప్రశ్న: ఆలూరు సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని తాగునీటి పథకాలు ఉన్నాయి?

జవాబు: హొళగుంద, చింతకుంట, బాపురం, విరుపాపురం, నమ్మలతేగిరి, ఐజేయరం, నేమకల్లు తాగునీటి పథకాలు ఉన్నాయి.

ప్రశ్న: జలాశయాలు నీటితో నిండారా?

జవాబు: జలాశయాల్లో 100 శాతం నీరు ఉంది. ప్రజలకు నిత్యమూ తాగునీరు ఇస్తున్నాం. మే వరకు ఇబ్బంది లేదు.

ప్రశ్న: జలాశయాల్లో పూడిక ఉందా?

జవాబు: పూడికను ఉపాధి పథకం ద్వారా గత సంవత్సరం తీసివేశాం. గట్ల మీద ముళ్ల కంప తొలగిస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య నివారణ చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఆర్డీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఈఈ సూచనల మేరకు బోర్లు, మోటార్లకు మరమ్మతులు చేయించాం.

ప్రశ్న: బాపురం విరుపాపురం జలాశయాల్లో మోటార్లు పనిచేయక నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది కదా?

జవాబు: నూతన మోటార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. విరుపాపురం జలాశయం వద్ద 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాం.

ప్రశ్న: తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలేవి?

జవాబు: సమస్య ఉన్న గ్రామాలు 24. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: నీటిని శుద్ధి చేయకుండానే సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: శుద్ధి చేసిన నీటినే గ్రామాలకు సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: ఆలూరుకు నీరు సరిగా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు?

జవాబు: పట్టణానికి రోజుకు 7లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నాం. ప్రణాళిక ప్రకారం నీటిని సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించాం.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



వినతులు స్వీకరిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి సంబంధిత శాఖలకు పంపుతామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ఆలూరు క్లస్టర్ ఇన్‌చార్జి కెంచెల్ డీసీ అధ్యక్షులు కిష్టప్ప, కన్వీనర్ అశోక్, గిరి మల్లేష్ గౌడ్ అట్టికల్ బాబు, నరసప్ప, సురేంద్ర, ఉప్పరప్ప యాదవ్ పాల్గొన్నారు.

విధులకు రాకపోతే ఎలా?

ఆలూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధులకు రాకపోతే ఎలా అని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ ప్రశ్నించారు. బుధవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఏటీసీ కాల్వ కింద 50వేల ఎకరాల ఆయకట్టు ఉందని అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ సొంత భవనంతో పాటు కాల్వల విస్తరణ నిధులు మంజూరుకు నీటిపారుదల మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

వాగీశతీర్థుల మద్యారాధన



వాగీశతీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి పరమగురువులైన పూర్వపు పీఠాధిపతి వాగీశ తీర్థుల మద్వారాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కర్ణాటకలోని అనుగొంది నవబృందావనంలో వెలసిన వాగేష తీర్థుల బృందావనానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు విశేషంగా బంగారు నాణేలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ద్వారపాలక అనంతస్వామి, రాజా ఎస్ అప్రమేయాచార్, పవన్ అచార్, విజయేంద్రాచార్, ఆనందతీర్థాచార్, గౌతమ్ అచార్, గోపాలకృష్ణస్వామి, వరదేంద్రాచార్, భక్తులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలని వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి విరుపాక్షి రెడ్డి డిమాండ్ చేశారు. తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు తీవ్ర ఎండలను సైతం లెక్క చేయకుండా రోజూ పనులకు హాజరవుతున్నారని అన్నారు. పేద కుటుంబాలు కేవలం ఉపాధి పనులపై ఆధారపడి తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. మూడు నెలలుగా వేతనాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చినా నిధులను పేదలకు చెల్లించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు విడుదల చేయాలని, లేనియెడల ఉపాధి కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైసీపీ మండల ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నందవరం: ఉపాధి కూలీలకు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి విరుపాక్షిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి కూలి పైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. కేవలం ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో రూ 3 కోట్లు కూలీలకు బకాయిలు ఉన్నాయంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మేరకు ఉంటుందో ఆలోచించాలన్నారు. వెంటనే కూలీలకు వేతనాలు ఇవ్వకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పెద్దకడుబూరు/ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ సోమవారం ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు జరుగుతున్నట్లు పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు రంగన్న, రాఘవేంద్ర తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 21వ తేదీ సోమవారం పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూములను దోచుకునేందుకు చేసిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాశింవలి, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేస్తుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాలను తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. బ్రిటీష కాలం నుంచి ఉన్న చట్టాలను రద్దు చేసి ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాదావలి, ఖాజా, తిమ్మగురుడు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్, టౌన్ అధ్యక్షులు హసీఫ్, హజరత్‌అలీలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: ఎమ్మెల్యే



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే స్వగృహంలో సీఎంఆర్‌ఎఫ్ 15 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు కూడా వాపస్ వెళ్లిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ పదినెలల కాలంలో 32మందికి దాదాపు రూ. 50లక్షలు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు శ్రీరాములు, నాయకులు కాశీం వలి, ధర్మాపురం గోపాల్, కురువ మలయ్య, మహేష్, సురేష్, గుల్లా సలాం, ముల్లా కలీముల్లా, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, శాలేమ్, జగదీష్, మిన్నప్ప, గిరి పాల్గొన్నారు.

● **టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 10లక్షల చెక్కు:** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పరమాన్ దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా కింద రూ.5లక్షలు, ప్రభుత్వం నుంచి మరో రూ. 5లక్షలు మొత్తం రూ. 10 లక్షల విలువచేసే చెక్కులను మృతుడి భార్యకు అందజేశారు.

● **రైతు కుటుంబానికి రూ. 7లక్షలు పరిహారం:** ఎమ్మిగనూరు మండలం కడివెళ్లకు చెందిన రైతు ఈడిగ నరసింహులు వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పుల బాధతో ఆత్మహత్యకు చేసుకున్నాడు. అప్పట్లో ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే బీవీ స్పందించి మృతుడి కుటుంబానికి రూ. 7లక్షలు సాయం మంజూరు చేయించారు.

వైసీపీ కుట్రలను ప్రజలు నమ్మరు

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి
● టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు



మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ హసీనా, ఆమె భర్త ఖాజాలకు టీడీపీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ, మాజీ సీఎం జగన్ ప్రాంతాల, మతాల, కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు చేస్తున్నారని, ప్రజలు వీటిని నమ్మరని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు దాదాపు 2వేల మందికి పైగా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బీవీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ హసీనా, ఆమె భర్త గట్టు ఖాజా, వైసీపీ నాయకులు, ప్రముఖ సామజిక వేత్త మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు ఆయన అనుచరులు, వైసీపీకి చెందిన నంబూరి సురేష్‌తో పాటు మరి కొందరు, తెలుగురాముడు ఆయన అనుచరులు, టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ శ్రీరాములు, పాత పదకొండో వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ లచ్చన్న, వైసీపీ నాయకులు వెంకటేష్, రవి, ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు కదిరికోట అనిల్ కుమార్, కదిరికోట శాంతరాజు, ఎంఎస్ నగర్‌కు చెందిన ఎంఆర్ మోహన్, మాల రాజేష్‌లతో పాటు వారి అనుచరులు పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు శ్రీరాములు, టీడీపీ నాయకులు రామదాసు గౌడ్, నరసింహులు, కాశీం వలి, ధర్మాపురం గోపాల్, కురువ మల్లయ్య, ముల్లా కలీముల్లా, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, అల్తాఫ్, రాజు, మహేష్, షాలేమ్, జయన్న, నరసన్న గౌడ్, కొండన్న గౌడ్, గుల్లా సలాం, కటారి రాజేంద్ర పాల్గొన్నారు.

అగ్రహారంలో తాగునీటి సమస్య

దేవరకు ప్రత్యేక ట్యాంకర్లతో నీటి సరఫరా

గోనెగండ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామానికి తాగునీరు అందించే బోర్లకు నీరు అందకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీవాసులు అల్లాడుతున్నారు. గ్రామస్థులు శివార్లలోని పంట పొలాలలో ఉన్న బావుల దగ్గరకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. దేవర ఉండటంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో కొంత తాగునీటి సమస్య ఉంది. దేవర సందర్భంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.





ట్యాంకర్ దగ్గర తాగునీటి కోసం వేచి ఉన్న గ్రామస్థులు, దొబ్బుడు బండ్లపై నీటిని తీసుకువస్తున్న దృశ్యం

భానుడి భగభగలు

● ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలు
● పట్టణాల నుంచి పల్లెలకు కూలీల తిరుగు ప్రయాణం



గుంటూరు నుంచి వెనక్కి వస్తున్న వలస కూలీలు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతోంది. ఉదయం 7గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ప్రజలు అల్లాడిపో తున్నారు. బతుకు దెరువు కోసం వలస వెళ్లిన కూలీలు ఎండ వేడిమిని భరించలేక పోతున్నారు. పట్టణాల నుంచి పల్లెలకు తిరుగు ప్రయాణం అవుతున్నారు. బుధవారం పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళంలోని వలస కూలీలు గుంటూరులో ఎండలు అధికంగా ఉండడంతో చేసేది లేక స్వగ్రామానికి తిరిగి వచ్చారు.

వైభవంగా దుర్గమ్మ దేవర



ఆలయం వద్ద భక్తుల సందడి

గోనెగండ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ అగ్రహారం గ్రామంలో దుర్గమ్మ దేవరను బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. దుర్గమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా సుందరంగా అలంకరించారు. వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కర్నూలు, బళ్లారి, మహబూబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. బోనాలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. పలు రాజయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం భక్తులు భజన చేశారు.

విద్యార్థినులకు మంత్రి లోకేశ్ అభినందనలు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం అభినందించారు. మండలంలోని బనవాసి బాలికల గురుకుల కళాశాలలో చదువుతున్న ధృతికాబాయి ఎంపీసీలో 987/1000, ఎంఈసీ గ్రూపులో వైష్ణవి 979 మార్కులు సాధించారు. అలాగే ఆదోని మండలం నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీపీ అండ్ మ్యానేజ్‌మెంట్ (క్రాప్‌ప్రొడక్షన్ మ్యానేజ్‌మెంట్)లో స్టేట్ ఫస్ట్ ర్యాంకును (958/1000) సాధించాడు. ఉండవల్లిలో తన నివాసంలో విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ వీరిని అభినందించి, సన్మానించారు. ఉన్నతంగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కామర్తి పద్మ(61)అనే మహిళ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన పద్మ ఎమ్మిగనూరులోని తమ బంధువుల ఇంటికి వచ్చింది. ఈనెల 14న శిల్పాఎస్టేట్‌లోని అయ్యప్పస్వామి గుడికి బంధువులతో కలిసి వెళ్లింది. అక్కడ ప్రమాదవశాత్తు ఆమె చీరకు నిప్పు అంటుకుంది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుడికల్ చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన గుడికల్ చెరువును పరిశీలించారు. ఎల్ఎల్‌సీ కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో వచ్చే నీటిని చెరువులోకి మళ్లించి పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగానే గంగిరెడ్డి చెరువు ఒడ్డుకు ఉన్న ముళ్లకంపలు, పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దాంతో వెంటనే చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసే పనులు చేపట్టారు.

సమస్య పరిష్కరించాలి

గోనెగండ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అలువాల గ్రామం నుంచి గుల్లమొరుసు గ్రామానికి వెళ్లే రస్త సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు శ్రీనివాసులు, పుల్లన్న, కృష్ణ కోరారు. 40ఏళ్లుగా ఇదే దారి వెంట అలువాల గ్రామం నుంచి గుల్లమొరుసు, పెద్దమరివీడు గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అయితే రస్తా పక్కనే ఉన్న రెండు కుటుంబాల వ్యక్తులు రస్త స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రస్తాకు ఇరువైపులా గుంతలు పెట్టి ముళ్ల కంపను వేశారని వాపోయారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బాషా, కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు వివాద స్థలాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలి

పెద్దకడుబూరు , ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఓటరు కార్డులో ఎలాంటి తప్పులు లేకుండా బీఎల్‌వోలు జాగ్రత్త వహించాలని ప్రత్యేకాధికారి అనురాధాదేవి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు కార్డు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ గీతాప్రియదర్శిని, ఆర్ఐ జర్మియా, మండల సర్వేయర్ అల్లప్ప, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

23న అంబేడ్కర్ జీవిత నాటక ప్రదర్శన

కరపత్రాలు విడుదల చేసిన తహసీల్దార్, కేవీపీఎస్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమైఖ్య సిద్ధాంతం, ఆయన ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేవిధంగా రూపొందించిన చరణం గచ్చామి నాటకాన్ని కళారూపకంగా ఈ నెల 23న మాధవరంలో నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.జయరాజు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నాటక కరపత్రాలను తహసీల్దార్ ఎస్.రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ నిజజీవితంలో అంటరానితనం, నిమ్నజాతుల కోసం పోరాడిన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చరణం గచ్చామి నాటక రూపాన్ని మాధవరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 21న పెద్దకడుబూరు, 22న కర్నూలు మండలంలోని ఉల్చాలలో, 23న మాధవరం, 24న ఎమ్మిగనూరు, 25న ఏనుగుబల, 26న కర్నూలు జిల్లా కేంద్రంల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి అంజి, నాయకులు ఇస్రాయేలు, ఏలిషా, దేవ, మారెప్ప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

బీఎల్‌వోలు నిర్లక్ష్యం వహించొద్దు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ

మంత్రాలయం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఓటర్ల నమోదు ఫారం-6, 7 వంటి అభ్యంతరాలు, రాజకీయ పార్టీలతో అనుసంధానంగా బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉంటూ చూసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మంత్రాలయం ఆర్వో అనురాధ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలలో ఒకరోజు బీఎల్‌వోలతో సమావేశమై ఓటరు జాబితాలో అభ్యంతరాలపై చర్చించాలన్నారు. ఓటరు జాబితాలో సవరణలపై ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. సమావేశంలో మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి, కౌతాళం తహసీల్దార్లు ఎస్.రవి, గీతా ప్రియదర్శిని, రుద్రగౌడు, రజనీకాంత్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు భీమన్నగౌడు, ఆనంద్, శ్వేత, భీముడు నరసప్ప సర్వేయర్లు చంద్రశేఖర్ నాయక్, హరి, తిమ్మేష్ పాల్గొన్నారు.

నకిలీ మొక్కజొన్న విత్తనాలతో మోసం

● రైతుల ఫిర్యాదుతో పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు
● మాధవరం పోలీసు స్టేషన్‌లో అన్నదాత ఫిర్యాదు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

మంత్రాలయం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రైతులు సుగాలి పరమేష్ నాయక్, సుగాలి గణపతినాయక్ నకిలీ విత్తనాలతో మోసపోయారు. గత ఐదు నెలల క్రితం యూపీఎల్ కంపెనీకి చెందిన వగరూరు సీడ్ ఆర్గనైజర్ వద్ద 8.50 ఎకరాలకు మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి తమ పొలంలో నాటారు. పంట ఏపుగా పెరిగింది. కాయ వచ్చేసరికి కాయలో విత్తనాలు లేకపోవడంతో రైతులు అవాక్కయ్యారు. వెంటనే సీడ్ ఆర్గనైజర్స్‌కు, వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం నంద్యాల సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డా. రామకృష్ణరావు, డా. వెంకటరమణ, సీనియర్ ప్లాంట్ రీడింగ్ అధికారి డా. సుజాతమ్మ, మండల వ్యవసాయాధికారి జీర గణేష్ పంటను పరిశీలించారు. పంట చేతికందే సమయంలో మొక్కకు ఉన్న కంకిలో విత్తనాలు లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. రైతులు వినియోగించిన మందులు, భూమి స్వభావం విచారించి నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. ఇందులో పరమేష్ నాయక్ మూడెకరాలు, గణపతి నాయక్ 5.50 ఎకరాలో సాగు చేసి దాదాపు 8.50 లక్షల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలుకు తీసుకుని సాగు చేసుకున్న గిరిజన రైతులకు న్యాయం చేయాలని మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పరిశీలనతో వీఏఏలు రాజేశ్వరి, లలిత, రైతులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని టీడీపీ గుడికల్ నాయకులు ఎలకన్న, అయ్యన్న, కౌలుట్ల అన్నారు. బుధవారం తహసీల్దారు శేషఫణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమి 1.40సెంట్లు కబ్జాకు గురైతే ఆ భూమిని పరిరక్షించాలన్నారు. గ్రామకంఠం భూమిని టీడీపీ నాయకులు కబ్జా చేశారని వైసీపీ నాయకులు ఆరోపించడం తగదన్నారు. ఆ స్థలంలో బీసీ కల్యాణమండపం ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర దృష్టికి తీసుకెళ్లామన్నారు. టీడీపీ నాయకులు కబ్జా చేసినట్లు నిరూపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజనయ్య, గిరి, ఉరుకుందు పాల్గొన్నారు.

మధ్యాహ్నంలోగా పనులు పూర్తి చేసుకోవాలి

గోనెగండ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నంలోగా ఉపాధి పనులు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో మణిమంజరి సూచించారు. చిన్నమరివీడు గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీవో పరిశీలించారు. అలాగే పొలంలో నిర్మించుకుట్టున్న నీటి తొట్టిలను పరిశీలించారు. ఉపాధి పథకం కింద రైతులు సాగు చేసుకుంటున్న పండ్ల తోటలను కూడా పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుతం మండలంలో ఉపాధి పనులకు గాను మూడు వేల మంది కూలీలు హజరవుతున్నాట్లు ఎంపీడీవో తెలిపారు. కూలీలకు కూలీ డబ్బులు త్వరగా చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అనంతశయనా, ఏపీవో మహమ్మద్‌బాషా, టీఏ ఉస్మాన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తాం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన పేదవిద్యార్థులను తనవంతు ప్రోత్సహిస్తానని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. మండలపరిధిలోని కందనాతి గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు ప్రవీణ్ కుమార్ ఇంటర్ బైపీసీలో 1000/982 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభకనబరిచారు. ఇందుకు స్పందించిన పట్టణంలోని మల్లికార్జున ఆర్థోపెడిక్ వైద్యశాల డాక్టర్ మల్లికార్జున విద్యార్థిని శాలువతో సన్మానించి నగదు పారితోషికాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ బోడబండ నరసింహులు, యాపిల్ ల్యాబ్ బీరప్ప, ఏపీయుడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసనాయుడు, నాగరాజు, పరమేష్, జాలవాడి బాషా, రామకృష్ణ, గాజుల వెంకటేష్, ఈరన్న, రాజు, హరి, ఎర్రన్న, అబ్రహం పాల్గొన్నారు.



ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ మల్లికార్జున